

భీమవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 26.0
తణుకు : 33.0 - 25.0



శ్రీరస్తు... శుభమస్తు !

» మూడు నెలల తరువాత మోగుతున్న పెళ్లి బాజాలు
» ఈనెల 25 వరకు ముహూర్తాలు

రేపటి నుంచి శ్రావణ సందడి



నరసాపురం, ఆగస్టు 3: మెడలో కళ్యాణమాల వేసుకోవాలని, కొత్త ఇంటిలోకి వెళ్లాలని, ఇళ్ల కట్టుకునేందుకు శంకుస్థాపన కోసం, ఉపనయాలకు మంచి ముహూర్తాల కోసం ఎదురుచూస్తున్న వారి కల నేరవేరనుంది. సోమవారం నుంచి శ్రావణమాసం, శుభకార్యక్రమాలకు మంచి మాసం, ఎక్కువ మంది వివాహాలు ఈ మాసంలోనే జరుపుకోవడం జరుగుతుంది. దీంతో మూడు నెలలు నుంచి మూఢం, శూన్యమాసాలు కారణంగా జిల్లా వ్యాప్తంగా శుభకార్యక్రమాలకు బ్రేక్ పడ్డాయి. మండపాలన్నీ మూతపడ్డాయి. పండితులు, కేటరింగ్, పూలడేకరేషన్ వంటి వ్యాపారులకు ఉపాధి కరువైంది. మళ్లీ వీరందరూ బిజీకానున్నారు. ఈనెల 7 నుంచి 25 వరకు దాదాపు 14 మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ శుభఘడియల్లో జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. అలాగే గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, ఉపనయాలు, తాంబూలాలు జరగనున్నాయి. ఇప్పటికే చాలా మంది మండపాలను బుక్ చేసుకున్నారు. ఈ ఒక్క నెలలోనే జిల్లాలో 5వేలకు పైగా వివాహాలు జరగనున్నట్లు పండితులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన వందల కోట్ల వ్యాపారం జరగనుంది. మరోవైపు ఈ శుభ కార్యక్రమాలకు వచ్చేందుకు దూర ప్రాంతాల్లో ఉన్నవారంతా సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే టిక్కెట్లు బుక్ చేసుకున్నారు.

ఈనెల 7 నుంచి ముహూర్తాలు

ఈ శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు 7, 8, 9, 10, 13, 15, 17, 18, 19, 22, 23, 24తేదీల్లో ఉన్నాయి. దాదాపు మూడు నెలల తరువాత ముహూర్తాలు ఉండటంతో ఈ మంచి గడియల్లో పెళ్లిళ్ల చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధం అవుతున్నారు. తాంబూలాలు కూడా ఈ ముహూర్తాల్లోనే చాలామంది పెట్టుకుంటున్నారు. గృహ ప్రవేశాలను కూడా ఈ ముహూర్తాలకే ఎంచుకున్నారు. దీంతో మంచి ముహూర్తాల్లో వేల సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. ఇప్పటికే కళ్యాణ మండపాలన్నీ బుక్ అయ్యాయి. వర్షాకాలం కావడంతో చాలా మంది ముందుగానే రిజర్వు చేసుకున్నారు. వచ్చే బంధువుల కోసం అడ్వాన్స్‌గా లాడ్జీలు కూడా బుక్‌చేశారు. ఈకారణంగా జిల్లాలోని నరసాపురం, పాలకొల్లు, భీమవరం, తణుకు, టీపీగూడెం వంటి పట్టణాల్లోని ముఖ్యమైన లాడ్జీలన్ని నిండుకున్నాయి. కేటరింగ్, పూల డెకరేషన్, పండితులు, వంట మనుషులు, ఫొటోగ్రాఫర్లు, లైటింగ్, సౌండ్ సిస్టమ్, బాజా బజంత్రీలు వాయించే వారు కూడా బుక్ అయిపోయారు. దీంతో మండపాలు దొరకని వారంతా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చూసుకుంటున్నారు.

కోట్లలో వ్యాపారం

గత పదేళ్ళ నుంచి జిల్లాల్లో పెళ్లిళ్ళ ట్రెండ్ మారింది. ఖర్చుకు వెనకాడటం లేదు. ఊరేగింపు, మెహంది, వీడియో షూటింగ్, లైటింగ్, భోజనాలు, బంగారం, బట్టల కొనుగోలుకు పెద్ద ఎత్తున ఖర్చు పెడుతున్నారు. కొన్ని వివాహాల ఖర్చు కోట్లకు కూడా చేరుతుంది. భోజనాల్లో 20 నుంచి 30 రకాల వంటలను కూడా వడ్డిస్తున్నారు. ఇక బంగారం కొనుగోలులో రాజీ అవ్వడం లేదు. ఈలెక్కన ఈశ్రావణ మాసంలో జరిగే పెళ్లిళ్ళ ఖర్చు కోట్లలో ఉంటుందని అంచనా వేస్తున్నారు. సుమారు 5వేలకు పైగానే ముహూర్తాలు ఉన్నాయి. కనీసం వివాహానికి రూ.5 లక్షలు ఖర్చు వేసుకున్నా.. వేలల్లో జరిగే శుభ కార్యక్రమాలకు రూ.100కోట్లుపైనే ఖర్చు అవుతుందని అంచనా. అయితే ఎక్కువ ఖర్చు బంగారానికే అవుతుంది.

రైళ్ళ టిక్కెట్ల ఫుల్..

ముహూర్తాలు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో జిల్లా మీదుగా నడిచే రైళ్లన్ని అప్పుడే నిండుకున్నాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖ నుంచి వచ్చే రైళ్ళకే ఎక్కువ డిమాండ్ ఉంది. ఎక్కువ మంది రానుపోను టిక్కెట్లను అడ్వాన్స్‌గా బుక్ చేసుకున్నారు. ఇటు కళ్యాణమండపాలు, లాడ్జీల పరిస్థితి కూడా ఇదే రీతిలో ఉంది. మళ్లీ సెప్టెంబర్‌లో శూన్యమాసం, భాద్రపథం మాసం కావడంతో ముహూర్తాలు లేవు, దీంతో ఎక్కువ మంది ఆగస్టులోనే పెట్టుకోవడంతో అన్ని నిండుకున్నాయి.

21 మంది తహసీల్దార్‌లకు పోస్టింగ్ ఉత్తర్వులు

భీమవరంటౌన్, ఆగస్టు 3 : ఎన్నికల ముందు జిల్లానుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయి తిరిగి జిల్లాకు వచ్చిన పలువురు తహసీల్దార్లకు జిల్లాలోని పలు తహసీల్దార్ కార్యాలయాల్లో పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ చదలవాడ నాగరాణి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 21 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు.

అధికారి పేరు	మండలం
పీఎస్‌డీ ప్రసాద్	ఏవో, కలెక్టర్ కార్యాలయం
సీహెచ్ రవికుమార్	సూపరింటెండెంట్ ల్యాండ్‌మేటర్స్ కలెక్టర్ కార్యాలయం
సీహెచ్ పెద్దిరాజు	డీఏవో, ఆర్డీవో ఆఫీస్ నరసాపురం
ఎస్.సాయికృష్ణ	తహసీల్దార్ కేఆర్ఆర్‌సీ, నరసాపురం
ఎస్‌కే హుస్సేన్	డీఏవో, ఆర్డీవో ఆఫీస్ తాడేపల్లిగూడెం
రవి రాంబాబు	తహసీల్దార్ భీమవరం
ఏవీ రామాంజనేయులు	తహసీల్దార్ వీరవాసరం
కె.నాగార్జున	తహసీల్దార్, ఉండి
నడింపల్లి భరతవిజయలక్ష్మి	తహసీల్దార్ పాలకోడేరు
నండూరి వెంకటేశ్వరరావు	తహసీల్దార్ ఆకివీడు
వైకెవీ అప్పారావు	తహసీల్దార్ గణపవరం
నీలాపుగురుమూర్తి రెడ్డి	తహసీల్దార్ నరసాపురం
సీహెచ్ విద్యాపతి	తహసీల్దార్ మొగల్తూరు
యాదాల దుర్గాకిషోర్	తహసీల్దార్ పాలకొల్లు
జి.అనిత కుమారి	తహసీల్దార్ పెనుగొండ
వై.రవికుమార్	తహసీల్దార్ పెనుమంట్ర
సయ్యద్ మౌలానాఫాజిల్	తహసీల్దార్ పోడూరు
ఎం.సునీల్ కుమార్	తహసీల్దార్ తాడేపల్లిగూడెం
డీవీఎస్ఎస్ అశోక్ వర్మ	తహసీల్దార్ తణుకు
వై.శ్రీనివాస్	తహసీల్దార్ పెంటపాడు
ఎం.సుందరరాజు	తహసీల్దార్ ఇరగవరం



బదిలీ పన్ను ఎగవేత

» స్థానిక సంస్థలకు మొండిచేయి » నెలలు తరబడి పెండింగ్
» వైసీపీ హయాంలో దారిమళ్లింపు » కూటమి రావడంతో ఆశలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రిజిస్ట్రేషన్ శాఖలో పన్నుల రూపేణా వచ్చే ఆదాయం కోసం స్థానిక సంస్థలు ఎదురుచూస్తున్నాయి. పంచాయతీలు, మున్సిపాలిటీలకు కోట్ల రూపాయలు నిధులు రావాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పన్నులు ఇవ్వకుండా తాత్సారం చేశారు. రిజిస్ట్రేషన్ శాఖలో వసూలు చేసిన 7.5 శాతం స్టాంప్ డ్యూటీలో 1.5 శాతం స్థానిక సంస్థలకు ఇస్తారు. అంటే రిజిస్ట్రేషన్ శాఖకు వచ్చే ఆదాయంలో 20శాతం సంబంధిత పంచాయతీలు, మున్సిపాలిటీలకు బదిలీ చేయాలి. గత డిసెంబరు నెలనుంచి పెండింగ్ పెట్టారు. వైసీపీ హయాంలోనే ఇలా బదలాయింపు పన్ను స్థానిక సంస్థలకు చెల్లించడం లేదు. ప్రతి నెలా రూ.3.50 కోట్లు మేర బదలాయించాల్సి ఉంటుంది. జిల్లాలోని 16 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ఆ సొమ్ము స్థానిక సంస్థలకు ఇవ్వాలి. ప్రభుత్వం అనుమతిస్తేనే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి స్థానిక సంస్థలకు మళ్లిస్తారు. వైసీపీ ప్రభుత్వంలో ఉద్దేశపూర్వకంగానే పన్ను బదలాయించలేదు. ఇప్పటిదాకా జిల్లాలో రూ. 28 కోట్లు మేర పెండింగ్‌లో ఉన్నాయి. వాటి కోసం స్థానిక సంస్థలు అల్లాడిపోతున్నాయి. పంచాయతీల నిర్వహణకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని ఆశిస్తున్నాయి. ప్రభుత్వ ఖజానా ఖాళీ కావడంతో పంచాయతీ నిధులను దారిమళ్లించడంలో వైసీపీ ముందుండేది. ఆర్థిక సంఘం నిధులను ఎత్తుకు పోయింది. కొన్నాళ్లపాటు పంచాయతీల ఆదాయాన్ని కూడా వినియోగించుకుంది. గడచిన ఐదేళ్ల పంచాయతీలకు చేదు అనుభవం మిగిలింది. ఆ పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలే పెదవి విరిచే దుస్థితి ఏర్పడింది. నిధుల కోసం రోడ్డెక్కారు.

నిర్వీర్యమైన పంచాయతీరాజ్

గడచని ఐదేళ్లలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైపోయింది పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. పట్టణాల్లోనూ అదే పరిస్థితి. మౌలిక వసతుల కల్పనలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ పంచాయతీలకు పూర్వవైభవం వస్తుందని ఆశిస్తున్నాయి. ఇప్పటికే పల్లెల అభివృద్ధి కోసం ప్రణాళికలు ప్రకటిస్తున్నారు. గతంలో పెండింగ్‌లో ఉండిపోయిన జాతీయ గ్రామీణ ఉపాధి నిధులతో పల్లెల్లో రహదారులు, డ్రెయిన్‌లు నిర్మిస్తున్నారు. వైసీపీ హయాంలో పనులు చేపట్టాలంటేనే కాంట్రాక్టర్‌లు వెనుకంజ వేసేవారు. బిల్లులు మంజూరు అయ్యేవి కావు. దాంతో రైతు భరసా కేంద్రాలు, సచివాలయాల నిర్మాణాలు కూడా నిలచిపోయాయి. పూర్తి చేసిన పంచాయతీల్లో బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారు. ఇప్పటికీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో చేపట్టిన రహదారులు, డ్రెయిన్‌లకు సంబంధించి జిల్లాలో రూ.9 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్‌లు పెండింగ్‌పనులను చేపడుతున్నారు. టెండర్‌లు వేస్తున్నారు. పనులకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పుడిప్పుడే పల్లెల్లో మౌలిక వసతులకు చర్యలు తీసుకుంటున్నారు. రహదారులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. పట్టణాల్లోనూ డ్రెయిన్‌లలో సిల్ట్ తొలగించేందుకు, ఇతర పనుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది, బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్ ద్వారా మున్సిపాలిటీలకు వచ్చిన ఆదాయంలో నిధులను వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేసింది. ఆదే రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా రావాల్సిన నిధులను బదాలయిస్తే స్థానిక సంస్థలకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. గతంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతినెలా ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి నిధులను స్థానిక సంస్థలకు బదలాయించేవారు. వైసీపీ హయాంలో పూర్తిగా గాడితప్పింది. నెలల తరబడి పెండింగ్ పెడుతూ వచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానిక సంస్థల్లో ఆశలు చిగురించాయి.



ఆచంట మండలం కోడేరు వద్ద తగ్గిన గోదావరి

తగ్గిన గోదావరి

కుక్కునూరు/ వేలేరుపాడు/ పోలవరం/ఆచంట/ ఆగస్టు 3: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ముంపు బారిన పడిన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గ్రామాలు కొద్దికొద్దిగా తేరుకుంటున్నాయి. నీట మునిగిన రోడ్లు బయట పడుతున్నాయి. మరోవైపు పంట పొలాలు నీట మునగడంతో వ్యవసాయ పనులు లేక ఉపాధి కరువైందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పోలవరం ప్రాజెక్టు ఎగువన గోదావరి నీటిమట్టం క్రమ క్రమంగా తగ్గుముఖం పడుతోంది. శనివారం పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 6,70,355 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. కడెమ్మ స్లూయిజ్ వద్ద గేట్లు వరద నీటి నుంచి బయటపడ డంతో ఏటిగట్టుకి కుడివైపున పంటపొలాల్లో ఉన్న వరద జలాలు వేగంగా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి.
- ఆచంట మండలంలో వశిష్ఠ గోదావరి ఉధృతి శనివారం నాటికి మరింత తగ్గడంతో మండలంలో ఉన్న కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి, పుష్కరఘాట్ రేవులు బయటపడుతున్నాయి. రేవులు మట్టితో కప్పబడి దర్శనమిస్తున్నాయి. గోదారి ఉధృతి బాగా తగ్గడంతో లంక వాసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇంకా లంక గ్రామాల్లో శానిటేషన్ పనులు , మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు.

పంటుకు గ్రీన్ సిగ్నల్..



నరసాపురం రూరల్ : వరద కారణంగా గత పది రోజుల నుంచి వశిష్ఠ గోదా వరిలో నిలిచిన పంటు, పడవల రాకపోకల్ని సోమ వారం నుంచి పునరుద్ధరించనున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో జిల్లా అధికారులు రాకపోకలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు నరసాపురం-సఖినేటిపల్లి రేవుల మధ్య పంటు తిరుగుతుందన్నారు. మరోవైపు మూడు రోజులుగా ఎండలు కాస్తుండడంతో రేవుల్లో బురద ఎండిపోవడంతో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తవు. ఇప్పటికే మండల పరిషత్ అధికారులు రెండు పంటులను పరిశీలించారు. సాంకేతికంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణం మరమ్మతులు చేయించాలని ఆదేశించారు.

గంజాయి విక్రేతకు మూడేళ్ల జైలు శిక్ష

మచిలీపట్నం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడిన వ్యక్తిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా న్యాయాధి కారి చిన్నంశెట్టి రాజు శనివారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాళ్ల మండలం బొంగారపుపేటకు చెందిన మీసాల శ్రీనివాసరావు గుడివాడ మండలం రామనపూడివద్ద గంజాయి విక్రయిస్తుండగా 2020 ఆగస్టు 1వ తేదీన గుడివాడ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

గోస్తనీ నదిలో కిక్కిస తొలగింపు పనులు

పెనుమంట్ర, ఆగస్టు 3 :ఎగువ నుంచి వచ్చిన మురుగు దిగువకు వెళ్లేందుకు పెనుమంట్ర మండలంలోని వేల్పూరు నుంచి మాముడూరు వరకు 18 కిలోమీటరు రాయి నుంచి 37.6 కిలోమీటర్ల వరకు మేట వేసిన కిక్కిస, తూడు తొలగించేందుకు 20 లక్షల 4 వేల రూపాయలు నిధులతో పనులు ప్రారంభించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోస్తనీ నది ప్రవాహం తూడు, కిక్కిసతో ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో మురుగు దిగువకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ డ్రెయినేజీ ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బల్లకట్టుపై ఎక్స్‌కవేటర్‌ను ఉంచి కాల్వ మధ్యలో మేటలను తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. డిసెంబరు నెలాఖరు వరకు గోస్తనీ నదిలో తూడు తొలగింపుతో పాటు మెయింటినెన్స్ పనులు కొనసాగుతాయని అత్తిలి డ్రెయినేజీ ఏఈ ఏవీ సత్యనారాయణ తెలిపారు. 2022లో వైసీపీ పాలనలో 18 కిలోమీటర్ రాయి నుంచి 37.6 కిలోమీటర్ రాయి వరకు కాల్వల తవ్వకాలు చేపట్టి నాలుగు ప్యాకేజీల్లో 90 లక్షల రూపాయలు ఖర్చు పెట్టడం జరిగిందని చెప్పారు. మాజీ మంత్రి చెరుకువాడ రంగనాథరాజు అనుచరులు సబ్ కాంట్రాక్టు తీసుకుని మొక్కుబడిగా పనులు చేపట్టి జేబులు నింపుకున్నారని గోస్తనీ నది ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు.



డ్రిప్ సేద్యం (ఫైల్)

సూక్ష్మ సేద్యానికి ఊతం

» జిల్లాలో 1500 యూనిట్‌ల లక్ష్యం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 3: సూక్ష్మసేద్యానికి ప్రభుత్వం ఊతం ఇవ్వనుంది. కూలి ఖర్చులు, నీటి ఆదాతోపాటు ఎరువుల వినియోగం తగ్గించడంతోపాటు దిగుబడి ఆశాజనకంగా పెరిగేందుకు ఈ డ్రిప్ సేద్యం ఊతం ఇస్తుంది. జిల్లాలో డ్రిప్ సూక్ష్మసేద్యం రాయితీ ద్వారా పొందేందుకు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ ఏడాదిలో 1500 యూనిట్‌ల లక్ష్యంగా అధికారులు నిర్దేశించుకున్నారు. చిన్న సన్నకారు రైతులకు 90శాతం సబ్సీడితో 5 ఎకరాలు పైబడిన రైతులకు 50శాతం సబ్సిడి తో పరికరాలు అందించేందుకు సిద్ధమయ్యారు. ఈ డ్రిప్ సూక్ష్మసేద్య పరికరాల కోసం రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. గతేడాదిలో ఈ యూనిట్ కోసం దరఖాస్తు చేసుకుని యూనిట్ పొందని రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని పీడీ పి వీరభద్రరావు స్పష్టం చేశారు. ఈ యూనిట్ కోసం రైతులు ఆధార్‌కార్డు, భూమి యాజమాన్య పత్రం, బ్యాంకు ఖాతా ఫొటో కాపీలతో సమీపంలోని ఆర్‌బీకేలలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

పెదమైనవాని లంక కోత నిరోధక కట్ట నిర్మాణానికి త్వరలో టెండర్ల ఖరారు

కలెక్టర్ చదలవాడ నాగరాణి



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, ఆగస్టు 3 : నరసాపురం మండలం పెదమైనవానిలంక వద్ద కోత నిరోధక కట్ట నిర్మాణానికి టెండర్స్‌ను త్వరలో ఖరారు చేస్తామని కలెక్టర్, స్టీరింగ్ కమిటీ చైర్మన్ చదలవాడ నాగరాణి తెలిపారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్టీరింగ్ కమిటీ మెంబర్లతో శనివారం కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించి, ప్రాజెక్టు టెండర్ పై బిడ్డర్లకు తలెత్తిన సందేహాలపై చర్చించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ దత్తత గ్రామమైన పెదమైనవానిలంక సముద్రం కోతకు గురై గ్రామంలోనికి సముద్రం నీరు చొచ్చుకు వస్తోందని గ్రామస్థులు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి గతంలోనే విన్నవించుకున్నారు. ఆమె చొరవతో డెలాయిట్ ఇండియా ఆధ్వర్యంలో కోత నిరోధక కట్ట నిర్మాణానికి ప్రతిపాదించి జూన్‌లో టెండర్లను పిలిచారన్నారు. డెలాయిట్ ఇండియా తన సి.ఎస్.ఆర్ నిధి నుంచి ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్టు తెలిపారు. కిలో మీటర్ మేర కోత నిరోధక కట్ట నిర్మాణానికి వచ్చిన ఆన్‌లైన్ టెండర్లను వచ్చేనెల 19న తెరిచి, ఖరారు చేయనున్నట్టు తెలిపారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో జల వనరుల శాఖ ఎస్ఈ సీహెచ్ దేవప్రకాష్, నరసాపురం ఆర్డీవో బి.అచ్యుత్ అంబరీష్, జల వనరుల శాఖ ఈఈ పి.సుబ్రహ్మణ్యేశ్వర రావు, డీఈఈ జి. వినోద్ చంద్, ఏపీ పీసీబీ, డెలాయిట్ ఇండియా, మద్రాస్ ఐఐటీ ల ప్రతినిధులు పాల్గొన్నారు.



భీమవరంలో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

వాహనాల ప్రత్యేక తనిఖీ

భీమవరం క్రైం, ఆగస్టు 3 : పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ రోడ్ సేఫ్టీ కమిటీ చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు పశ్చిమ గోదావరి జిల్లా రవాణాశాఖ పరిధిలో ఉన్న ఆటోలపై జిల్లా వాహన తనిఖీ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్ విద్యార్థులను అధిక మొత్తంలో చేరవేస్తున్న ఆటోలపై కేసులు విధించి అపరాధ రుసుములు విధించారు. ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మూడు చక్రాల ఆటోలో 12 ఏళ్ల వయస్సులోపు ఆరుగురు విద్యార్థులకు మాత్రమే ఆటో పరిమితమి, అధిక మొత్తంలో విద్యార్థులను చేరవేయడం నిషేధమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యం గమనించాలన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భీమవరంలో కేఎస్ఎన్ ప్రసాద్, ఎంవీఐ సీహెచ్ వెంకటరమణ, ఎంవీఐ ఎం.రవికుమార్, ఏఎంవీఐ ఎస్ఎల్ఎస్ లక్ష్మీ, ఏఎంవీఐ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఏఎంవీఐ పాల్గొన్నారు. పాలకొల్లు పరిధిలో ఎంవీఐ ఎం.వెంకటేశ్వరరావు, తణుకులో ఎంవీఐ జి.సంజీవ్‌కుమార్, తాడేపల్లిగూడెంలో ఎంవీఐ డీఎస్ఎస్ నాయక్‌లు పాల్గొన్నారు. మొత్తం 56 ఆటోలపై కేసులు రాసి రూ.1,41,550 అపరాధ రుసుం విధించారు. ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయన్నారు. రహదారి భద్రత గురించి ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని జిల్లా రవాణాశాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

అలంకరణ పనులతోనే.. సరిపెట్టారు..

నాడు నేడు పనులంటూ మభ్య పెట్టిన జగన్ సర్కార్

» వైసీపీ హయాంలో రూ.261.37 కోట్లకు ఇచ్చింది 145.77 కోట్లే..
» అవసరమైన 551 అదనపు గదులు నిర్మాణం నిలిపేశారు..
» పాఠశాలలో వసతులు లేక విద్యాబోధన ఇరకాటం
» కూటమి రాకతో దశ మారుతుందా.. ఆశతో విద్యార్థులు



భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 3 : గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి తలపెట్టిన నాడు-నేడు ప్రాజెక్టును అభాసుపాలయ్యేలా చేసింది. దాదాపుగా రెండేళ్ల క్రితం మొదలు పెట్టిన తరగతి గదులు మధ్యలో నిలిచిపోయి వెక్కిరిస్తున్నాయి. పాఠశాలల భవనాలు, మరుగుదొడ్లకు కేవలం రంగులు వేయడానికి పరిమితమై అవసరమైన తరగతి గదుల నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం చాలా చోట్ల మొండి గోడలుగా దర్శనమిస్తున్నాయి. వైసీపీ సర్కారు తప్పిదంతో ప్రభుత్వం మారినా మూడో విద్యా సంవత్సరంలోను విద్యార్థులు చదువుకొవడానికి ఇబ్బందులు పడుతున్నారు. విలీనం అనే తప్పుడు నిర్ణయంతో విద్యార్థులను దూరం పాఠశాలకు వెళ్ళేలా చేశారు. అక్కడ పాఠశాలలో ఇరుకు గదులతో బోధనకు పరిమితం చేశారు. కూటమి ప్రభుత్వం రాకతో పాఠశాలలు దశ మారుతుందనే ఆశలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌తో ఉపాధ్యాయుల భర్తీ తీర్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే అదనపు తరగతి గదులు నిర్మాణం పైన దృష్టి పెట్టాల్సి ఉంది.

35 వేల విద్యార్థులు ప్రైవేటు బాట..

గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి చేస్తామని నాడు-నేడు ప్రాజెక్టు తీసుకొచ్చింది. ఫస్ట్ ఫేజ్ అని వందల కోట్లు ఖర్చు పెట్టి పాఠశాలల అభివృద్ధి చేస్తామన్నారు. 2022లో సెకండ్ ఫేజ్ నాడు-నేడు అంటూ జిల్లాలో రూ.145.77 కోట్లు ఖర్చు పెట్టారు. అభివృద్ధి పనులు విద్యార్థులకు ఉపయోగపకరంగా కనిపించలేదు. దీంతో 2021 - 22 విద్యాసంవత్సరం నుంచి 2023 - 24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 35 వేల మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లబాట పట్టారు. ప్రస్తుత 2024-25 విద్యా సంవత్సరంలో కూటమి ప్రభుత్వం ఉండడంతో కేవలం 2,600 విద్యార్థులు మాత్రమే తగ్గారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు పెరుగుతారనే ఆశలో విద్యాశాఖ అంచనా వేస్తుంది.

159 అదనపు గదులే పూర్తి

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన తరగతి గదులు ఏర్పాటులో వైసీపీ ప్రభుత్వం చిన్న చూపు చూసింది. జిల్లాలోని 365 పాఠశాలలో 710 అదనపు తరగతి గదులు నిర్మించాల్సి ఉంది. 2021-22 విద్యా సంవత్సరం నుంచి ఈ అదనపు తరగతి గదులు అవసరం ఉంది. వీటి కోసం 2022 సంవత్సరంలో జనవరిలో అప్పటి ప్రభుత్వం రూ.126.47 కోట్లు నిధులు కేటాయించి గదులు నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాక నిలిపివేసింది. దీంతో 159 గదులు మాత్రమే నిర్మాణం జరిగాయి. 510 గదులు నిర్మాణం జరగలేదు. గదులు నిర్మాణానికి కేటాయించిన నిధులతో 20 శాతం నిధులతోనే సరిపెట్టింది. దీంతో అవసరమైన గదులు అందుబాటులోకి రాలేదు.

ఇంకా పనులు మిగిలే ఉన్నాయి..

వైసీపీ ప్రభుత్వంలో తలపెట్టిన సెకండ్ ఫేజ్ నాడు-నాడు పనులు ఇంకా మిగిలే ఉన్నాయి. 2022 జనవరిలో నిధులు మంజూరన్నారు. ఏడాదిలోగా పనులు పూర్తి చేయవచ్చు. అలాంటిది నిధులు అందించడంలో జాప్యం పనులకు ఆటంకం ఏర్పడుతు సాగాయి. చివరికి 1317 ప్రాజెక్టు పనులుగాను రూ.261.37 కోట్లుకి 145.77 కోట్లు మాత్రమే ఇచ్చారు. దీంతో తలపెట్టిన పనులు ఇంకా కనిపిస్తున్నాయి.

స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కాంపినేంట్స్ 1వ భాగంగా చేయాల్సిన వాటిలో టాయిలెట్స్ 518కి 497 పూర్తయ్యాయి. కిచెన్ షెడ్‌లు 392కి 371 మాత్రమే కట్టగా 21 షెడ్‌లు పూర్తి చేయాల్సి ఉంది. 494 పాఠశాలల మరమ్మతులు చేయాల్సి ఉండగా 390 మరమ్మతులు చేశారు. 522 పాఠశాలలకు విద్యుత్ పనులు చేయాల్సి ఉండగా 509 పాఠశాలలో పూర్తి చేయగలిగారు. డ్రింకింగ్ వాటర్ ఏర్పాటులో 648 పాఠశాలలకు గాను 643 పాఠశాలల్లో ఏర్పాటు చేయగా ఐదుచోట్ల డ్రింకింగ్ వాటర్ పెండింగ్‌లో ఉంది.

ప్రహరీల ఏర్పాటులోను వెనకడుగే

పాఠశాలలకు సెక్యూరిటీగా ఉండే ప్రహరీల ఏర్పాటులోను వైసీపీ ప్రభుత్వం వెనుకడుగు వేసింది. 337 పాఠశాలలకు ప్రహరి గోడలు (కాంపౌండ్ వాల్) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంతలో మాట మర్చరు. దీంతో 83 పాఠశాలకు మాత్రమే ప్రహరి గోడలు నిర్మాణం జరిగాయి. ఏకంగా 254 ప్రహరీ గోడలు నిర్మాణం చేపట్టలేదు.

స్కౌట్స్ యూనిట్ ఏర్పాటు చేయండి : డీఈవో



ఏలూరు అర్బన్, ఆగస్టు 3 : జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ అమలవుతున్న 150 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు స్కౌట్స్ కార్యకలాపాలపై ఒక రోజు ఓరియంటేషన్ క్లాసులు శనివారం స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో జరిగాయి. డీఈవో అబ్రహం మాట్లాడుతూ స్కౌట్స్ శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు లభించే సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పాఠశాలలోను స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించేందుకు స్కూల్ హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. స్కౌట్స్ జిల్లా కార్యదర్శి భాస్కర్ కుమార్, హెచ్‌ఎం కుటుంబరావు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు నూరు శాతం ఉండాలి

ఏలూరు సిటీ, ఆగస్టు 3: ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు పాఠశాలలకు నూటికి నూరు శాతం హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు ఒక ప్రణాళిక ప్రకారం వెళ్లాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పేర్కొన్నారు. ఏలూరు జడ్పీ ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. బడి మానివేసిన వారిని తిరిగి పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు, ఉద్యోగులు వారి తల్లి తండ్రులకు చదువు గొప్పతనాన్ని తెలిపి విద్యార్థులు పాఠశాలలకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో రోజువారీ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు అందాయా లేదా అని తెలుసుకుని పాఠ్యపుస్తకాలు కొరత లేకుండా చూడాలన్నారు. ఈ సమీక్షలో డీఈఓ అబ్రహం, జడ్పీ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు, డిప్యూటీ సీఈవో ఎస్ నిర్మలా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుతేజం పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 3 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లోని మారుమూల పట్టణాలు, గ్రామాల్లో ఉన్న ఉపాధ్యాయులు, వైద్యులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి, వారిని సేవాభారతి, తెలుగుతేజం జాతీయస్థాయి పురస్కారాలతో గౌరవించేందుకు నిర్ణయించినట్లు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎస్.ఎస్.నారాయణ మాస్టారు ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత రంగాల్లో సేవలందించేవారు ప్రతి భావంతులు పురస్కారాల ఎంపిక నిమిత్తం వారి సేవలు, ప్రతిభను తెలియ జేసే సర్టిఫికెట్లు, ఫోటోలు, పత్రికల క్లిప్పింగ్‌ల జిరాక్స్ కాపీలను జతచేసి ఈ నెల 10వ తేదీలోగా 'ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15' చిరునామాకు దరఖాస్తును పంపాలని సూచించారు. ఎంపికైనవారికి ఈ నెల 18న హైదరాబాద్‌లో పురస్కారాలను అందజేస్తామన్నారు. వివరాలకు ఫోన్ నెంబరు 96523 47207లో సంప్రదించాలని కోరారు.



ఫిర్యాదులు నమోదు చేస్తున్న పల్లా, బందారు మాధవ నాయుడు

టీడీపీ కేంద్ర కార్యాలయానికి వినతుల వెల్లువ

భీమవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజలు, కార్యకర్తల నుంచి పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు వినతులు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే బందారు మాధవ నాయుడు పాల్గొన్నారు. వైసీపీ బాధితులైన పలువురు తమకు న్యాయం చేయాలని పార్టీ అధ్యక్షుడిని వేడుకున్నారు. తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మిగతావి ఆ శాఖల అధికారులకు పంపించారు. రాజధాని నిర్మాణానికి, అన్న క్యాంటీన్ల కోసం దాతలు తమ విరాళాలు నేరుగా ముఖ్యమంత్రికి అందజేశారు. అనంతరం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు.



రగులుతోంది మొగలి పొద..

ద్వారకాతిరుమల, ఆగస్టు 3: ఓ వరి పొలంలో తాచు, జెర్రిగొడ్డు మసకలాడుకోవడాన్ని అక్కడి రైతులు తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించారు. పాముల మసకలాట గురించి చెప్పుకోవడమే కాని స్వయంగా చూసేవారు అరుదుగా ఉంటారు. ఈ దృశ్యం మండలంలోని హెచ్. లింగపాలెం పౌల్ట్రీ వద్ద ఉన్న ఓ పొలంలో శనివారం మధ్యాహ్నం రైతుల కంటపడింది. ఈ రెండు పాములు పెనవేసుకుని రెండు గంటల పాటు ఇలాగే ఉన్నాయని... చాలా మంది రైతులు వాటిని ఫొటోలు తీసినట్లు చెప్పారు.

వరిపొలంలో తాచు, జెర్రిగొడ్డు మసకలాట దృశ్యం

విద్యార్థుల సంఖ్యే టీచర్ల..

పని సర్దుబాటుకు ప్రామాణికం

తనిఖీల్లో అనైతిక పద్ధతులు రుజువైతే

ఎంఈవో, హెచ్‌ఎంల సస్పెన్షన్

ఎస్‌ఎంసీ ఎన్నికలు ముగిసేవరకు టీచర్లకు సెలవుల్లేవ్

వెబెక్స్ సమావేశంలో పాఠశాల విద్య ఉన్నతాధికారులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 3 : టీచరు పోస్టులను కాపాడుకోవడానికి కాన్వెంట్ల నుంచి బాలబాలికల పేర్లను కొన్నిచోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడాన్ని సహించబోమని, ఇటువంటి అనైతిక పద్ధతులను అనుసరించే స్కూళ్ళను గుర్తించేందుకు త్వరలో సెక్టోరల్ అధికారులు, ప్రభుత్వేతర సంస్థ (ఎన్జీవో)లతో క్షేత్రస్థాయి తనిఖీలను నిర్వహించనున్నట్టు శనివారం డీఈవోలు, ఎంఈవోలతో పాఠశాల విద్య ఉన్నతాధికారులు నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో వెల్లడించారు. విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తదితరు లు నిర్వహించిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను ప్రకటించారు. ప్రధానంగా టీచర్ల కొరతను అధిగమించేందుకు చేపట్టనున్న పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్) ప్రక్రియకు ఈ నెల 4వ తేదీని కటాఫ్‌గా తీసుకుని, పాఠశాలలో భౌతికంగా ఉన్న విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయులను ప్రామా ణికం ఆధారంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను నిర్వహిస్తామని ప్రకటించారు. తమ వద్ద ఉన్న యూడైస్ రోల్‌కు, పాఠశాలలో బాలబాలికల ఫిజికల్ రోల్‌కు తేడా ఉన్నట్టుగా సెక్టోరల్ అధికారులు, ఎన్జీవోలు నిర్ధారణ చేస్తే సంబంధిత ఎంఈవో, స్కూలు హెచ్‌ఎంలను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అయితే కీలకమైన జీవో 117 మార్గదర్శకాల మేరకే విద్యార్థులు, ఉపాధ్యాయుడు నిష్పత్తిని నిర్వహిస్తారా లేక మరేదైనా ఫార్ములాను పాటించాలా అనే విషయంపై ఉన్నతాధికారులు సమావేశంలో నేరుగా స్పష్టతనివ్వకపోవడం గమనార్హం. హేతుబద్ధీకరణ అనంతరం పాఠశాలలో అవసరానికి మించి ఉన్న మిగులు (సర్‌ప్లస్) టీచర్లను తొలుత సంబంధిత మండల పరిధిలో, ఆ తర్వాత సమీప మండలాల్లో కొరత ఉన్న పాఠశాలలకు తాత్కాలిక ప్రాతిపదికన నియమిస్తామని వివరించారు. ఆ ప్రకారం చూస్తే జిల్లాలో ఇప్పటికే ప్రతి మండలంలో సగటున 15 నుంచి 40 మంది వరకు ఎస్జీటీలు, ప్రతి హైస్కూలులో 3 నుంచి ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్‌గా ఉన్నట్టు ప్రాథమికంగా తేలింది. ఇక లెసన్ ప్లాన్‌లను ఉపాధ్యాయులందరూ అప్‌డేట్‌గా ఉంచుకోవాలని, వచ్చే వారం నుంచి విద్యాశాఖమంత్రి, పాఠశాల విద్య కార్యదర్శి, కమిషనర్‌లు ముందుగా సమాచారం ఇచ్చిన తర్వాతే తనిఖీలకు వస్తామని వెల్లడించారు. ఉపాధ్యాయులు ఇక మీదట పాఠశాలల్లో టాయిలెట్లను ఫోటోలు తీయడం ఐచ్ఛికమే తప్ప, తప్పనిసరికాదని తేల్చి చెప్పారు. ఆదివారం సాయంత్రంలోగా టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం(టిస్) డేటాలో తప్పులుంటే ఎడిట్ ఆప్షన్‌లో సవరించుకోవాలని ఆదేశించారు. సెకండ్ మెథడాలజీ ఆధారంగా ఎస్జీటీలను హైస్కూళ్ళలో నియమించడంతోపాటు, పదోన్నతులకు కూడా ప్రామాణికంగా తీసుకుంటామని పేర్కొన్నారు. స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)లకు ఈ నెల 8న ఎన్నికలు నిర్వహించనున్న దృష్ట్యా అవి ముగిసేవరకు టీచర్లకు సాధారణ సెలవుల(సీఎల్స్)తో సహా ఎటువంటి సెలవులు మంజూరు చేయరాదని ఆదేశించారు. పాఠశాలల విజిట్ లకు వెళ్ళే డీఈవోలు, ఎంఈవోలు తమ పరిశీలనలు, రిమార్క్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తేనే అధికారికంగా తనిఖీలు చేసినట్టుగా పరిగణిస్తామని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. పాఠశాలల్లో పది మందిలోపు విద్యార్థులున్న వాటిని గుర్తించి సంబంధిత స్కూళ్ళలో విద్యార్థులను పెంచేలా కృషి చేయాలని, ఒకవేళ పిల్లల సంఖ్య పెరిగే అవకాశం లేకపోతే వాటిపై తదుపరి చర్యల నిమిత్తం ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆదేశించారు.

తమ భార్యలను కాపురానికి పంపాలని దీక్షలు



కలెక్టరేట్ వద్ద తోడల్లుళ్ళ దీక్ష

ఏలూరు రూరల్, ఆగస్టు 3: తమ భార్యలను కాపురానికి పంప కుండా తిరిగి తమపై కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్న మామ బీకే శ్రీనివాస రామానుజ అయ్యంగార్‌పై చర్యలు తీసుకుని తమ భార్యలను కాపురానికి పంపించాలంటూ ఇద్దరు తోడల్లుళ్ళు కలెక్టరేట్ వద్ద శనివారం దీక్ష చేపట్టారు. తోడల్లుళ్ళు వంగిపురం పవన్, శేషసాయి మాట్లాడుతూ తమ భార్యలను కాపురాలకు పంపకుండా తమ మామగారు అయ్యంగార్ తమపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఇటీవల ఉన్నతాధికారులను కలిసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేయగా, ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో న్యాయం కోసం దీక్షలు చేపట్టినట్లు తెలిపారు.

బార్ అసోసియేషన్ క్రీడా పోటీలు

భీమవరం క్రైం, ఆగస్టు 3 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ తెలిపారు. శనివారం చెస్, క్యారెమ్స్, షటిల్ పోటీలు డీఎన్నార్ ఇండోర్ స్టేడియంలో జరిగాయి. డబుల్స్ విభాగంలో బండి ఫణి, చంద్రశేఖర్ వంశీ విన్నర్స్‌గా, తరుణ్, శివాజీరాజులు రన్నర్స్‌గా నిలిచారు. జూనియర్స్ విభాగంలో తరుణ్ విన్నర్‌గాను, బాలాజీ రన్నర్‌గా, సీనియర్ విభాగంలో సాయిశరణ్ విన్నర్‌గాను, మేక శివప్రసాద్ రన్నర్‌గా నిలిచారు. మహిళా విభాగంలో రాధ విన్నర్, అమూల్య రన్నర్‌గా సీనియర్స్ విభాగంలో రాధ, కీర్తి విన్నర్‌గా భాగ్యశ్రీ, శ్యామల రన్నర్‌గా నిలిచారు. స్పోర్ట్స్ కార్యదర్శి హరి మాట్లాడుతూ విజేతలకు ఆగస్టు 15న జడ్జిల చేతుల మీదుగా బహుమతులు అందిస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ టి. శ్రీనివాస్

ముంపు ప్రాంతాల్లో పీఆర్-126 సాగుకు మొగ్గు

పెనుమంట్ర, ఆగస్టు 3 : వరి పొలాలు దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతులు పీఆర్-126 రకం సాగుకు మొగ్గుచూపుతున్నారని, అటువంటి ప్రాంతాల్లో బాక్టీరియా, ఆకు ఎండు తెగులుపై అవగాహన కల్పించాలని మార్టేరు ఏడీఆర్ డాక్టర్ టి. శ్రీనివాస్ కోరారు. శనివారం మార్టేరులో నిర్వహించిన టీఎస్‌వీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పొటాష్ వాడకం పెంచవలసిన ఆవశ్యకత ఉన్నదని, దీనివల్ల పంటకు చీడపీడలను తట్టుకునే శక్తి పెరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వరరావు జిల్లాలో పంటలు, వాతావరణ పరిస్థితులపై వివరించారు. అధిక వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో రాయితీపై స్వల్పకాలిక రకాలను అందించడానికి సిబ్బందిని సమాయత్తం చేశామని తెలిపారు. వ్యవసాయ అధికారులకు వివిధ వరి నాటు పద్ధతుల్లో వాడవలసిన ఎరువుల మోతాదుపై అవగాహన కల్పించవలసిన అవసరం శాస్త్రవేత్తలపై ఉందన్నారు. ఆరుతడి పద్ధతిలో వరి పండించే పరిజ్ఞానాన్ని పొలంబడిలో ప్రవేశపెట్టాలని ఆయన సమావేశంలో తెలిపారు. వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న పొలం బడి కార్యక్రమంలో తప్పనిసరిగా శాస్త్రవేత్తలు హాజరు కావాలని కోరారు. అంతేకాక వ్యవసాయ శాఖ సమన్వయంతో వివిధ మండలాల్లో పర్యటించి రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేయాలని కోరారు. కార్యక్రమానికి ప్రధాన శాస్త్రవేత్త డా.ఎం.వి.కృష్ణాజీ, సమన్వయకర్తగా వ్యవహరించగా పలువురు శాస్త్రవేత్తలు తమ సూచనలు తెలిపారు.



ధర్నా చేస్తున్న గొల్లలకోడేరు పంచాయతీ కార్మికులు

జీతాలివ్వలేదని పంచాయతీ కార్మికుల ధర్నా

పాలకోడేరు, ఆగస్టు 3: జీతాలివ్వాలంటూ పంచాయతీ కార్యాలయం ముందు కార్మికులు శనివారం ధర్నా చేపట్టారు. గొల్లలకోడేరు పంచాయతీ కార్యాలయంలో కొందరు యువకులు గతేడాది కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేసేందుకు తక్కువకు టెండర్లకు వేసి విధుల్లో చేరి జీతాలు సరిపోవడంలేదని కొద్దిరోజులకే మానేశారు. దీంతో వార్డుసభ్యుల తీర్మానం మేరకు కొత్తవారికి పంచాయతీలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించారు. ప్రస్తుత పంచాయతీ పాలకపక్షం పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు కొంత కాలంగా జీతాలివ్వడంలేదు. దీంతో వారు జీతాలు ఇవ్వాలని పంచాయతీ కార్యాలయం ముందు శనివారం ధర్నా చేపట్టారు. వీరికి మద్దతుగా వార్డు సభ్యులు సైతం ధర్నాలో కూర్చున్నారు. విషయం తెలుసుకున్న భీమవరం డీఎల్‌పీఓ సీహెచ్.వెంకట బాలాజీ పంచాయతీ కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టారు. తక్కువ రేటుకు టెండర్లు వేసి ఉద్యోగాలు మానే సిన వారిని తొలగించి వార్డుసభ్యులు ఆమోదించిన పంచాయతీ కార్మికు లను పనిలోకి చేర్చుకుని వారికి పెండింగ్ జీతాలివ్వాలని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఈఓపీఆర్డీ ఆంజనేయులు, కార్యదర్శి లక్ష్మి, పంచాయతీ వార్డు సభ్యుడు పాల్గొన్నారు. సర్పంచ్ లక్ష్మి సైతం జీతాలివ్వాలని ఆదేశించారు.

శ్రీవారి సేవలో విశ్రాంత న్యాయమూర్తి



విశ్రాంత న్యాయమూర్తి భవానీప్రసాద్‌కు మెమెంటో ఇస్తున్న ఏఈవో

ద్వారకాతిరుమల, ఆగస్టు 3: ద్వారకా తిరుమల చిన వెంకన్నను ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జి. భవానీప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనకు అర్చకులు వేదాశీర్వచనం అందజేయగా ఆలయ ఏఈఓ నటరాజారావు జ్ఞాపిక, ప్రసాదం అందించారు.

భక్తులతో ఆలయం కళకళ..

చిన్నతిరుమలేశుని ఆలయం శనివారం భక్తులతో కళకళలాడింది. ఉచిత దర్శనానికి గంట పైబడి సమయం పట్టింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆ తరువాత వకుళమాత అన్నప్రసాద భవనానికి వెళ్లి స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆర్టీసీ బస్సులు సైతం భక్తులతో కిటకిట లాడాయి.



జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, ఆగస్టు 3 : జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలో శనివారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా రహదారులపై పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, లైసెన్సు ఉండాలని, వాహన ఇన్సూరెన్సు, సి-బుక్ ఉండాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు ఎక్కువ మంది తలకు దెబ్బతగిలి ప్రాణాలు కోల్పోతున్నారని అదే హెల్మెట్ ధరిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చునని తెలిపారు. సరైన ధ్రువపత్రాలు లేనివారికి జరిమానాలు విధించారు.

రవాణా కార్యాలయం వద్ద రగడ

భీమవరం క్రైం, ఆగస్టు 3 : ప్రైవేటు స్కూల్ డ్రైవర్‌కు హోంగార్డుకు మధ్య తలెత్తిన వివాదం రచ్చకెక్కింది. ఈ నెల 2న ఒక ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్ రోడ్డుపై వెళ్తుండగా ఆర్టీవో కార్యాలయంలో పనిచేసే హోంగార్డుకు డ్రైవర్‌కు మధ్య వివాదం జరిగింది. దీంతో ఆ బస్సు డ్రైవరు రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు శనివారం వెళ్ళగా అక్కడే ఉన్న హోంగార్డు కోపోద్రిక్తుడై అధికారులకు ఫిర్యాదు చేస్తావా అంటూ బస్సు డ్రైవర్ పై చేయి చేసుకున్నాడు. దీంతో బస్సు డ్రైవర్ తోటి బస్సు డ్రైవర్‌లను రవాణాశాఖ కార్యాలయానికి రప్పించడంతో అక్కడ వాగ్వాదం జరిగింది. చివరికి రవాణాశాఖ అధికారి కొందరు అధికారులు అక్కడకు చేరుకుని నచ్చ చెప్పారు. హోంగార్డుతో బస్ డ్రైవర్‌కు క్షమాపణ చెప్పించడంతో గొడవ సద్దుమణిగింది.

కానిస్టేబుల్‌పై చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, ఆగస్టు 3 : జిల్లా కలెక్టరేట్‌లో తనకు తెలిసిన అధికారి ఉన్నాడని ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక లాండ్రీ నిర్వాహకుడి కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఏడు లక్షల రూపాయలు కానిస్టేబుల్ తీసుకుని మోసగించాడని ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఏలూరు వంగాయిగూడెం ప్రాంతానికి చెందిన భీమవరపు లింగేశ్వరరావు ఇస్త్రీ చేస్తూ ఉంటాడు. అతని వద్దకు ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ డి. శ్రీనివాసరెడ్డి (పిసి 586) తన వస్త్రాలు ఇస్త్రీ చేయించుకోవడానికి వస్తూ ఉండేవాడు. లింగేశ్వరరావు కుమారుడు నాగేశ్వరరావు నిరుద్యోగిగా ఉన్నాడు. తనకు ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో తెలిసిన అధికారి ఉన్నాడని ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని దఫదఫాలుగా ఏడు లక్షల రూపాయలను నాగేశ్వరరావు నుంచి తీసుకున్నాడు. 2023 మే 16వ తేదీ నుంచి 2024 మే 26వ తేదీ వరకు ఈ సొమ్ములను తీసుకున్నాడు. ఆ తరువాత సమాధానం చెప్పకపోవడంతో బాధితుడు ఏలూరు వన్‌టౌన్ పోలీసులుకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసరెడ్డి ఇదే విధంగా అనేక మందిని మోసగించినట్లుగా ఇంకా బాధితులు ఎందరో ఉన్నారని చెప్తున్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

ఉంగుటూరు, ఆగస్టు 3: చేబ్రోలు పోలీసు స్టేషన్ పరిధిలోని గొల్లగూడెంలో పదో తరగతి చదువుతున్న బాలిక పట్ల దౌర్జన్యం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం బాలిక పాఠశాలకు వెళ్లి సైకిల్‌పై జూలై 31న ఇంటికి వెళుతున్న సమయంలో గోపీనాథపట్నం గ్రామానికి చెందిన ఉప్పాటి రామకృష్ణ గొల్లగూడెం శివారు నల్లమాడు రోడ్డులో బాలికను ఆపి అసభ్యంగా ప్రవర్తించి ఇబ్బంది పెట్టడంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్టు చేబ్రోలు ఎస్సై ఏ.మణికుమార్ తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారం కేసులో..


ముగ్గురి అరెస్టు



పాలకొల్లు రూరల్, ఆగస్టు 3 : పాలకొల్లు పట్టణంలో గత నెల 29న వృద్ధురాలిపై అత్యాచారం, దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అసిం తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలో నివసిస్తున్న పక్షవాత రోగి అయిన వృద్ధురాలిపై పాత నేరస్థుడైన అమలాపురానికి చెందిన బొక్కా రాజు, పాలకొల్లు మావుళ్ళమ్మ పేటకు చెందిన మీసాల మావుళ్ళు, రాజమండ్రి వాంబే కాలనీకి చెందిన గుబ్బల రామకృష్ణను స్థానిక సంతమార్కెట్ ఏరియాలో అదుపులోకి తీసుకుని సుమారు రూ. 4 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు, స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. వృద్ధురాలు ఒంటరిగా ఉన్న సమయంలో నిందితులు చోరీ చేసేందుకు ఇంట్లోకి వచ్చి హాల్లో షెల్ఫ్‌లోని మొబైల్‌ను తీసి జేబులో పెట్టుకున్నారని అనంతరం 75 ఏళ్ళ వృద్ధురాలిని హతమార్చి ఆమె ఒంటిపైన గల నగలను కాజేసేందుకు ఒకరు వృద్ధురాలిని దిండుతో ముఖంపై గట్టిగా అదిమి పట్టగా మరొకరు సిమెంట్ దిమ్మెతో ఆమె తలపై కొట్టి గాయపరిచారని ఎస్పీ తెలిపారు. అనంతరం ఆమె ఒంటిపై గల బంగారు ఆభరణాలతో పాటు గదిలో హ్యాండ్ బ్యాగ్‌లోగల రూ.15 వేలు దొంగిలించారు. అనంతరం నిందితుల్లో ఒకరు వృద్ధురాలిపై అత్యాచారం చేసి పారిపోయారని, దీనిపై వృద్ధురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు వారి ఇంటిలోని సీసీ ఫుటేజ్ చూసి పట్టణ సీఐ మంగాదేవి పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. శనివారం ఉదయం నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. నరసాపురం డీఎస్పీ జి. శ్రీనివాసరావు, పాలకొల్లు సీఐ కె. మంగా దేవి, పట్టణ ఎస్ఐ బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి



యల్లా రాజు (ఫైల్)

ఆచంట, ఆగస్టు 3: మండలం లోని భీమలాపురంలో జూనియర్ లైన్‌మన్‌గా పని చేస్తున్న యల్లా రాజు (30) విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో లైన్‌మన్ రాజు విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా కరెంటు సరఫరా రావడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. తలకు బలమైన గాయమవడంతో వెంటనే 108లో పాలకొల్లు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. విద్యుత్ సరఫరా నిలిపి పనులు చేస్తున్నా కరెంటు సరఫరా కావడంతో ఈ ప్రమాదం జరిగింది. రాజు మృతితో గ్రామంలో విషాద చాయలు నెలకొన్నాయి. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

దెందులూరు/ఏలూరు క్రైం, ఆగస్టు 3: దెందులూరు పంచాయతీ పరిధిలోని అలుగులగూడెం రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని యువకుడిని గుర్తు తెలియని రైలు ఢీ కొనడంతో మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సుంటుందని, నలుపు రంగు టీషర్టు, బిస్కట్ రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహానికి పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టాలు దాటేటప్పుడు రైలు ఢీ కొనడం వల్ల మరణించి ఉంటాడని ప్రాథమికంగా గుర్తించారు. ఎస్ఐ సైమన్ సెల్ నెంబర్ 9989219559కు సమాచారం అందించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ..

మొగల్తూరు: కాళీపట్నం తూర్పు పంచాయతీలో 216 జాతీయ రహదారిపై శనివారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఏఎస్ఐ కె.సత్యనారాయణ తెలిపారు. భీమవరం మండలం నాగిడిపాలెం పంచాయతీ రెడ్డి చెరువు గ్రామానికి చెందిన పొన్నమండ ఐరావతి (70) అనే వృద్ధురాలు చిన్నగొల్లపాలెంలోని తన కుమార్తె ఇంటికి నడుచుకుంటూ వెళుతోంది. కాళీపట్నం తూర్పు పంచాయతీలోని జాతీయ రహదారిపై ఈమెను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

జంగారెడ్డిగూడెం: స్థానిక బైపాస్ రోడ్డులోని ఎస్సార్ పెట్రోల్ బంకు నుంచి రాజమండ్రి వెళ్ళే రహదారిలో దాబా వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు కొయ్యలగూడెం మండలం రామానుజపురం గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటరమణ (32)గా గుర్తించామన్నారు. మృతుడు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. బైపాస్ రోడ్డుపై నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తలకు తీవ్ర గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. డీఎస్పీ రవిచంద్రా రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి మృత దేహాన్ని పరిశీలించి స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వైసీపీ పాలనలో ప్రతి పనిలోనూ అవినీతే..



కేక్ కట్ చేస్తున్న వావిలాల..చిత్రంలో ఆరిమిల్లి

తణుకు, ఆగస్టు 3: గత వైసీపీ పాలనలో తణుకు మునిసిపాలిటీలో కౌన్సిల్ లేని సమయంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రతి పనిలోనూ పెద్దఎత్తున నాటి మంత్రి కారుమూరి అవినీతికి పాల్పడ్డారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. శనివారం రాష్ట్రపతి రోడ్డులోని డ్రెయిన్‌లో సిల్టు తొలగించే పనులను ఆయన పరిశీలించారు. గత పాలకులు డ్రెయిన్‌లో సిల్టు తీయకపోవడంతోనే వర్షం వచ్చినపుడు రోడ్లపైకి మురుగునీరు పారుతుందన్నారు. సిల్టు తీయకుండా ఏడాదికి రూ.5నుంచి 10 లక్షలు ఖర్చు చేయకుండా తన సొంత అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన చేశారని విమర్శించారు. కలగర వెంకటకృష్ణ, మంత్రిరావు వెంకటరత్నం, మల్లిన రాధాకృష్ణ, కొమ్మిరెడ్డి శ్రీనువాసు పాల్గొన్నారు.

ఘనంగా వావిలాల పుట్టినరోజు వేడుకలు

టీడీపీ నాయకులు వావిలాల సరళాదేవి పుట్టిన రోజును శనివారం ఆమె నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఉచితంగా కుట్టు మిషన్ నేర్పించడం, మొక్కలు నాటే కార్యక్రమం, పేద మహిళలకు దుప్పట్లు, గొడుగులు పంపిణీ చేశారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. కుటుంబ సభ్యుల మధ్య వావిలాల కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పేదలు పస్తులు ఉండకూడదనే అన్నక్యాంటీన్లు



పేదలకు భోజనాలు వడ్డిస్తున్న రామరాజు

ఆకివీడు, ఆగస్టు 3 : పేదలకు పస్తులుండకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు అన్నారు. దాత గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు తన తండ్రి జ్ఞాపకార్థంగా స్థానిక దొరగారి చెరువు దగ్గర అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి యాభై రోజులు పైబడడంతో శనివారం ఆయన సందర్శించి పేదలకు భోజనాలు వడ్డించి, తనూ తిని మాట్లాడారు. టీడీపీ నాయకులు ఉన్నారు.

సుబ్బరాజు మాస్టారుకు ఉద్యోగ విరమణ సన్మానం



సుబ్బరాజు దంపతులకు సన్మాన దృశ్యం

ఉండి, ఆగస్టు 3 : ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన పేరిచర్ల సుబ్బరాజు మాస్టారు సేవలు మరువలేనివని మండలపరిషత్ అధ్యక్షుడు ఇందుకూరి హరినారాయణరాజు అన్నారు. వాండ్రం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి పదవీ విరమణ చేసిన సుబ్బరాజు దంపతులకు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ అధ్యక్షత వహించారు. ఎంపీటీసీ సభ్యుడు పీఆర్‌కే ఆంజనేయరాజు, ద్వారంపూడి నారాయణరెడ్డి, సత్తి బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆపద సమయంలో జనసేన సభ్యత్వం ఆసరా



సభ్యత్వ నమోదులో బొలిశెట్టి రాజేష్

పెంటపాడు, ఆగస్టు 3 : ఆపద సమయంలో జనసేన సభ్యత్వం ఆసరాగా ఉంటుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు రాజేష్ అన్నారు. శనివారం పెంటపాడు గేటు సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన జనసేన సభ్యత్వ నమోదు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో మొత్తం 450 మంది సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నట్లు జనసేన నాయకులు కసిరెడ్డి మధులత, కొవ్వూరి లక్ష్మణరెడ్డి తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి

కాళ్ళ, ఆగస్టు 3 :గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు తెలిపారు. కాళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై అధికారులు వివరించారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీలు, సాగునీటి, తాగునీటి సమస్యలు తలెత్తకుండా పంట మురుగు కాల్వలు అభివృద్ధి చేయాలని అధికారులను కోరారు. మురుగు కాల్వలను ఆక్రమణ చేస్తున్నారని ఈ సమస్యపై ఇప్పటికే ఉన్నతాధికారులు ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్ళామని డ్రెయినేజీ శాఖ ఏఈ జయప్రకాష్ తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ తాగునీరు ఆక్వా చెరువుల వల్ల కలుషితమైపోతున్నాయని, తాగునీటిని ప్రతీ ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలని సూచనలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ముంపుకు గురైన నారుమడులు పాడైపోవడంతో ప్రభుత్వం 80శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయనున్నట్లు వ్యవసాయాధికారి జయవాసుకి తెలిపారు. జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, సర్పంచ్‌ల ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, ఎంపీడీవో జి.స్వాతి, ఏవో ఎంఎస్ ప్రభాకరరావు, ఎంఈవో వెంకటేశ్వరరావు, ఏఈలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

నరసాపురం టౌన్, ఆగస్టు 3 : అన్నక్యాంటీన్ పనులు ఈనెల పదో తేదీ నాటికి పూర్తి చేయాలని కమిషనర్ వెంకటేశ్వరావు ఆదేశించారు. శనివారం స్టీమర్‌రోడ్‌లో జరుగుతున్న పనుల్ని ఆయన పరిశీలించారు. ఈనెల 15 నుంచి అన్నక్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభిస్తున్నందున పనుల్ని పూర్తి చేయాలన్నారు. డిజైన్ ప్రకారం పనులు చేపట్టాలన్నారు. ఏఈ సునీల్, సిబ్బంది ఉన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడేవే ఎన్నికలు

ఆకివీడురూరల్ ఆగస్టు 3 :ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఎన్నికలే ప్రధాన కారణమని పెదకాపవరం జడ్పీ పాఠశాల హెచ్‌ఎం కాళహస్తీశ్వరుడు అన్నారు. పాఠశాలలో ఎస్‌పీఎల్ ఎన్నికలను శనివారం నిర్వహించారు. షెడ్యూల్ విడుదల నుంచి నామినేషన్లు, విత్ డ్రాలు, ఓటు వేసే విధానంపై పలు అంశాలను వివరించారు. ఈ ఎన్నికల్లో మొదటి ఎస్‌పీఎల్‌గా ప్రతాప్ రాట్నాల, రెండో ఎస్‌పీఎల్‌గా ధోనిక్ పొన్నాడ, మూడో ఎస్‌పీఎల్‌గా మేడపాటి సాయిదుర్గ ఎంపికైనట్టు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఉండి, ఆగస్టు 3 : చేతులతో కొట్టి గాయపరిచిన ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఉండి పోలీసులు శనివారం తెలిపారు. పాందువ్వకు చెందిన మాదాసి రామయ్యను అదే గ్రామానికి చెందిన లక్ష్మయ్య యేసురత్నం అనే ఇద్దరు అకారణంగా ఈనెల ఒకటిన గ్రామంలో కొట్టారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

ఆధ్యాత్మికం

అమ్మవార్లకు ఆషాఢం సారె



శ్రీ మావూరమ్మకు సారె సమర్పిస్తున్న మహిళలు

పాలకొల్లు అర్బన్/ ఆకివీడు / తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 3 : స్థానిక బంగారు వారి చెరువగట్టున ఉన్న శ్రీ మావూరమ్మకు మహిళలు ఆషాఢం సారెను సమర్పించారు. పలు రకాల పండ్లు, స్వీట్లు, పసుపు, కుంకుమ, గాజులతో మేళ తాళాలతో బంగారు వారి చెరువు చుట్టూ ప్రదక్షణలు చేసి సారె చీర సమర్పించుకున్నారు. ఆకివీడు పట్టణంలోని స్థానిక మాదివాడ గంగానమ్మ-మద్దిరావమ్మలకు మహిళలు, భక్తులు ఆషాఢ మాస సారె సమర్పించారు. టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్ సతీమణి తదితరులు ఉన్నారు. తాడేపల్లిగూడెం రూరల్‌లోని ముత్యాలంబపురంలోని ముత్యాలమ్మకు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో ఆషాఢం సారె సమర్పించారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరంటౌన్, ఆగస్టు 3 : స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈనెల 15న స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై శనివారం స్థానిక కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో డీఆర్‌వో జె.ఉదయభాస్కరరావుతో కలసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ముఖ్య అతిథి హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, అనంతరం వారి ప్రసంగం, స్వాతంత్ర్య సమర యోధులతో పరిచయ కార్యక్రమం, మాక్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంసాపత్రాలు అందించడం తదితర కార్యక్రమాలు ఉంటా యన్నారు. పరేడ్ కార్యక్రమాన్ని పోలీస్ శాఖ నిర్వహించాలని, వేదిక ఏర్పాట్లను రెవెన్యూ డివిజనల్ అధికారి, స్థానిక తహసీల్దార్ పర్యవేక్షిస్తారని తెలిపారు. పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇనుమడింపజేసేలా శకటాలను ప్రదర్శించాలని, ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవార్డుల కోసం ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల వివరాలు అందజేయాలన్నారు. ప్రతీ శాఖ నుంచి ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులకు మాత్రమే అవకాశం కల్పించాలని సూచించారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.అచ్యుత్ అంబరీష్, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర అజరామరం

భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర ప్రపంచంలోనే గుర్తింపు పొందిందని, సమర యోధుల చరిత్ర అజరామరం అని కలెక్టర్ నాగరాణి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాల బ్రోచర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కమిటీ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి 17వ తేదీ క్విట్ ఇండియా దినోత్స వం వరకు ఆయా కళాశాల, పాఠశాలల్లో, పట్టణాలు, గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తామని, విద్యార్థులకు పలు అంశాలపై పోటీలను నిర్వహిస్తామన్నారు.

కలెక్టర్‌కు జ్ఞాపిక అందించిన సుబ్బారావు

వీరవాసరం మండలం నవుడూరు సెంటర్‌లో భరత మాత టవర్ నిర్మాణకర్త వడ్డీ సుబ్బారావు జిల్లా కల్టెకర్ చదలవాడ నాగరాణిని కలసి జ్ఞాపికను బహూకరించారు. టవర్ నిర్మాణం ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఆయన రచించిన తాపీ చెక్కిన శిల్పం పుస్తకాన్ని ఆమెకు బహూకరించారు. కలెక్టర్ సుబ్బారాను అభినందించారు.

పంట నష్ట వివరాల సేకరణ

ఆచంట, ఆగస్టు 3 : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మురుగు డ్రెయిన్‌లు పొంగి ప్రవహించడంతో మండలంలోని అనేక చోట్ల మురుగు కాల్వలను ఆనుకుని ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. నారుముడులు వేసిన వరి నాట్లు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు మునిగిపోయిన వరి పంట చేల నష్టం వివరాలను ఆచంటలో వీఆర్‌వో సీతారామ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ సుధీర్ పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం

పెంటపాడు, ఆగస్టు 3: తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులందరికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందుతుందని, రైతులె వరూ ఆందోళన చెందవద్దని తాడేపల్లిగూడెం డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ మురళీకృష్ణ, ఏవో పార్థసారథి అన్నారు. శనివా రం బీ.కొండేపాడు, మీనవల్లూరు, రావిపాడు తదితర గ్రామాలలో వర్షం కారణంగా పాడైన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన రైతుల వివరాల జాబితాను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

నేడు ట్రస్టు ఆసుపత్రికి షుగర్ స్పెషలిస్టు

పెంటపాడు, ఆగస్టు 3: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 4 వ తేదీన హైదరాబాద్ అపోలో ఆసుపత్రి నుంచి షుగర్ స్పెషలిస్టు డాక్టర్ రాజశేఖర్ వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. షుగర్, పాదాల తిమ్మిర్లు, మంటలు, స్పర్శ లేకపోవడం, రక్తప్రసరణ తగ్గడం, మానని పుండ్లు, పాదాల వంకర, కుళ్ళిపోవడం, తదితర సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆపరేషన్ అవసరమైతే సోమవారం ట్రస్టు ఆసుపత్రిలోనే శస్త్ర చికిత్స చేస్తారని తెలిపారు.

పార్కు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ఉండి, ఆగస్టు 3: ఉండి పార్కులో అభివృద్ధి పనులను ఈనెల 15వ తేదీకి పూర్తి చేయించాలని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు కుమారుడు భరత్ అన్నారు. శనివారం ఉండి విచ్చేసిన భరత్‌కు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఉండిలో కలిదిండి అబ్బాయిరాజు పార్కులో చేపట్టిన పనులను ఆరా తీశారు. పొత్తూరి వెంకటేశ్వరరాజు, కాగిత బుజ్జి పాల్గొన్నారు.

హోటల్స్‌లో పరికరాలు శుభ్రంగా ఉంచాలి

ఆకివీడు, ఆగస్టు 3 : హోటల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా, నిల్వ ఆహారాలు సరఫరా చేస్తే చట్టపరమైన చర్యలతో పాటు జరిమానాలు విధిస్తామని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ హెచ్చరించారు. శనివారం పట్టణ పరిధిలో ఆయన పలు హోటల్స్, పండ్ల దుకాణాలు పరిశీలించి మాట్లాడారు. నిబంధనలు పాటించాలన్నారు. అధిక ధరలు వసూలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

భీమవరంటౌన్, ఆగస్టు 3 :సమస్యలను పరిష్కరించాలని, జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని భీమవరం నియోజకవర్గం, వీరవాసరం మండలం ఈ-పంచాయత్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు గాడి శివాజీ, డి.జయ బాబు, చల్లగండ్ల హర్షమణికంఠ, తాటిపర్తి అచ్చుతరావు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అంజిబాబును కలిసి వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ డేటా ఎంట్రీ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బస్‌పాస్‌ల వితరణ

గణపవరం/తణుకు, ఆగస్టు 3: గణపవరం జడ్పీ హైస్కూలులో 280 మంది విద్యార్థులకు గణపవరం టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్ రాజు, మానవత డైరెక్టర్ శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో బస్‌పాస్‌లను అందజేశారు. ఉండి మానవత ఆధ్వర్యంలో దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను అందజేశారు. అత్తిలి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని 273 మంది విద్యార్థులకు ఉచితంగా బస్ పాసులను శనివారం దాత దాసం ప్రసాదు ఆర్థిక సాయంతో బస్ పాసులు అందించినట్టు డిపో మేనేజర్ గిరిధర్ చెప్పారు.



భీమవరంలో సంగీత, నృత్య కళాశాల ఏర్పాటు చేయాలి

భీమవరంటౌన్, ఆగస్టు 3:విద్యా కేంద్రంగా బాసిల్లుతున్న భీమవరంలో సంగీత నృత్య కళాశాల ఏర్పాటు చేయాలని త్యాగరాజ భక్త సభ సభ్యులు చెరుకువాడ రంగసాయి కోరారు. డిగ్రీ, ఇంజనీరింగ్, ఏంబీబీఎస్, ఐటీఐ తదితర కళాశాలలతోపాటు సంగీత నృత్య కళాశాలలో శిక్షణ తీసుకునేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, బహు తక్కువగా ఈ కళాశాలలు ఉండడం వల్ల శివారు ప్రాంతాల్లో సంగీత అభిమానులకు సంగీత శిక్షకులకు దూరంగా ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కళలను ప్రాచుర్యంలోకి తీసుకుని రావాలంటే సంగీత నృత్య కళాశాలను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులను కోరుతున్నామన్నారు. భీమవరంలో వందేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు దేశంలోనే పేరుగాంచాయని, ఈ కళాశాల స్థాపనకు భీమ వరంలో అన్ని సౌకర్యాలున్నాయని తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

తణుకు, ఆగస్టు 3: మహిళా చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సివిల్ జడ్జి కె.సత్యకృష్ణ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆదర్శ మహిళా మండలి సభ్యులతో చట్టాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో మహిళా మండలి ప్రాజెక్టు అధికారి ఎం.పార, న్యాయమూర్తులు కె.కృష్ణ సత్యలత, పీవీ రంజిత్‌కుమార్, ఎవి.నాగరాజు, పీఎస్పీ చిరంజీవిరావు, బార్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం డిగ్రీ కాలేజీని సందర్శించిన ఆర్‌జేడీ

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 3 : స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ శోభారాణి సందర్శించారు. ఈ సందర్భంగా 23- 24 సంవత్సరాల కళాశాల సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కళాశాల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని జగన్ ప్రభుత్వం

► మంత్రి నిమ్మల రామానాయుడు



పశువుల దాణాను పంపిణీ చేస్తున్న మంత్రి

యలమంచిలి; ఆగష్టు, 3 జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో రైతులను, వ్యవసాయాన్ని పట్టించుకోకుండా గాలికొదిలేసిందని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెంలోని ముంపు ప్రాంతంలోని రైతులకు శనివారం పశువుల దాణా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. వరద ప్రాంతాల్లోని బాధితులను ప్రభుతం ఆదుకుంటుందన్నారు. 25 కిలోలు బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.3 వేలు ఆర్థిక సాయం అందించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 4,202 పశువులకు గాను రూ.17లక్షల 53వేలు విలువ చేసే 111 టన్నుల దాణాను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. సర్పంచ్ కామిశెట్టి సాయిబాబా, టీడీపీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, వలవల శివరామకృష్ణ, పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ జి.మల్లేశ్వరరావు, డాక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, బీవీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే లక్ష్యాలు సాధ్యం : మంత్రి

పాలకొల్లు అర్బన్ : ఇష్టపడి చదివితే లక్ష్యాలను సాధించవచ్చని విద్యను అందించే విద్యాసంస్థను, తల్లిదండ్రులకు గౌరవాన్ని తీసుకుని రావడం ద్వారా మంచి భవిష్యత్‌ను పొందగలరని మంత్రి నిమ్మల అన్నారు. స్థానిక డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 42వ వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శోభారాణి అధ్యక్షత వహించారు.















